క్లుప్తంగా

నాణ్యమైన భోజనం అందించండి



హాస్టల్‌లో భోజనాన్ని రుచి చూస్తున్న జిల్లా అధికారిణి లక్ష్మీదేవి

గడివేముల: విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని నంద్యాల జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిణి లక్ష్మీదేవి అన్నారు. మంగళవారం రాత్రి మండల కేంద్రమైన గడివేములలోని బీసీ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లో వండిన భోజనాన్ని ఆమె స్వయంగా రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..భోజనంలో మెనూను కచ్చితంగా అమలు చేయాలన్నారు. పదవ తరగతి పరీక్షల్లో బీసీ హాస్టల్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలన్నారు. అనంతరం హాస్టల్ పరిసరాలను పరిశీలించి వార్డెన్ వెంకటపతికి పలు సూచనలు చేశారు.

భవన నిర్మాణాలు పూర్తి చేయాలి

గూడూరు రూరల్: మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో చేపట్టిన సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు పీఆర్ ఏఈ గోపాల్‌రావు సూచించారు. పెంచికలపాడులోని సచివాలయ భవన నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూడిదపాడు, కె.నాగలాపురం, పెంచికలపాడు, చనుగొండ్ల గ్రామాల్లో సచివాలయం, ఆర్‌బీకే భవన నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయన్నారు. మార్చి చివరిలోపు పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



పాణ్యం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న దృశ్యం

గడివేముల/పాణ్యం: గడివేముల మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో పని చేస్తున్న అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిరసన తెలిపి వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ మాధవ్‌కు అందజేశారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఉపయోగిస్తున్న వంట గ్యాస్ ఖర్చులను ప్రభుత్వమే భరించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్చల వసుంధరదేవి, కుమారి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పాణ్యంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ..అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వడంతోపాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం రెవెన్యూ సిబ్బందికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో వెంకటమ్మ, మరియమ్మ, మాబున్నిసా, శ్యామల, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

అనుమానితుల సమాచారం ఇవ్వండి



మహిళా పోలీసులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య

గడివేముల: గ్రామాల్లో ఎవరైనా అనుమానంగా ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని గడివేముల ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయా గ్రామాలకు చెందిన మహిళా పోలీసులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పేకాట, జూదం ఆడే వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. పండుగ సందర్భంగా ఊర్లకు వెళ్లే వారు విలువైన వస్తువులను జాగ్రత్తగా దాచుకోవాలన్నారు. ఎవరైనా చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి

గూడూరు రూరల్: పాఠశాలలో నాడు–నేడు పనులను నాణ్యతతో చేపట్టాలని హెచ్‌ఎంకు ఎంఈఓ సునీలమ్మ సూచించారు. మునగాలలోని ఎస్సీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. పనులపై హెచ్‌ఎం, స్కూల్ కమిటీ చైర్మన్ దృష్టి సారించాలన్నారు. ఆయా నిర్మాణ పనులను ప్రతి రోజు పర్యవేక్షించాలని ఆమె తెలిపారు.

అన్నా పెన్షన్ అందిందా..?

- ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా..
- 'గడప గడప'లో ప్రజలతో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



ఎర్రదొడ్డిలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్



పెన్షన్ అందుతుందా అని వికలాంగుడు మాదన్నను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

కోడుమూరు: అన్నా పెన్షన్ అందిందా.. అక్కా అమ్మ ఒడి వచ్చిందా.. పెద్దాయన రైతుభరోసా డబ్బు అకౌంట్‌లో పడిందా..చెల్లెమ్మా పొదుపు రుణమాఫీ డబ్బు వచ్చిందా అంటూ ఎర్రదొడ్డి గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల లబ్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. మంగళవారం మండలపరిధిలోని ఎర్రదొడ్డి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా చెప్పాలని కోరారు. ప్రజల విన్నపం మేరకు ఎర్రదొడ్డిలో రూ.20 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు వేయించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి వీధిలైట్ల సమస్య లేకుండా చూడాలని సంబంధిత అధికారులను కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి పేదవాడు ఆర్థికంగా అభివృద్ధి కావాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన ఎన్నికల హామీలను ఒక్కటీ కూడా నెరవేర్చలేదని, అభివృద్ధిని కూడా పూర్తిగా విస్మరించడంతో ప్రజలు 2019 ఎన్నికల్లో టీడీపీకి తగిన బుద్ధి చెప్పారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న పదవి చేపట్టిన ఆరు నెలల్లోపే ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని అమలు చేశారన్నారు. పేద ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఏటా పెన్షన్ పెంచుతున్నారని తెలియజేశారు. అయితే పెన్షన్లను తొలగిస్తున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని ప్రజలను కోరారు. కోడుమూరు నియోజకవర్గంలో మూడున్నర సంవత్సరాల్లో తాగునీటి పథకాలు, సీసీ రోడ్లుతో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఎమ్మెల్యే తెలియజేశారు. కోడుమూరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు తెలుగుదేశం పార్టీ నేతలు సిద్ధమా అని సవాల్ విసిరారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నను ప్రజలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, బాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు తిరుపతి, చంద్రశేఖర్‌రెడ్డి, మస్తాన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రభాకర్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపాడులో సంక్రాంతి ఆటల పోటీలు

గూడూరు రూరల్: మండల పరిధిలోని పెంచికలపాడు గ్రామంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఈ నెల 14 నుంచి 15 వరకు ఆటల పోటీలను నిర్వహించనున్నట్లు మంగళవారం నిర్వాహకులు పోతురాజు చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. దయ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 14న క్రికెట్ పోటీలను నిర్వహిస్తామని, గెలుపొందిన జట్లకు మొదటి బహుమతిగా రూ. 5016లను దాత శ్రీ రాఘవ శంకర ట్రేడర్స్, రెండవ బహుమతిగా రూ. 3016లను దాత ఎంపీటీసీ కుర్వ మద్దిలేటి అందిస్తారన్నారు. 15న పరుగు పందేలాట జరుగుతాయని, గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.3016లను కురువ వెంకటరాముడు, రెండవ బహుమతిగా రూ. 2016లను పంజరి బజారి అందిస్తారని తెలిపారు. అదే రోజు (ఆదివారం) సాయంత్రం ముగ్గుల పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా 5 తులాల వెండి పతకాన్ని దాత వీబీపీ యూత్, రెండవ బహుమతిగా 3 తులాల వెండి పతకాన్ని కురువ పెద్ద మద్దిలేటి అందిస్తారన్నారు. ఆయా పోటీల్లో పాల్గొనదలచిన వారు 98488 28852 నంబర్‌లో సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

అవకాశాలు అందిపుచ్చుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రాజెక్టు అధికారి డాక్టర్ వేణుగోపాల్

గూడూరు: అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక జెడ్పీ బాలుర పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. .పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని, ప్రణాళికా బద్ధంగా చదువుకున్నప్పుడే అది సాధ్యం అవుతుందన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే విధంగా స్టడీ మెటీరియల్ తయారు చేయించామని, దానిని ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట డీఈ కర్రెన్న, సెక్టోరియల్ అధికారి విజయప్రసాద్, ఎంఈఓ సునీలమ్మ, సీఆర్‌పీలు దస్తగిరి, బాషలు ఉన్నారు.

సి.బెళగల్: నాబార్డు నిధులతో చేపట్టిన పాఠశాల అభివృద్ధి పనులను ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రం సి.బెళగల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో రూ.1.09 కోట్ల నాబార్డు నిధులతో చేపట్టిన అదనపు గదుల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులను పరిశీలించారు. పాఠశాలలోని బాలుర మరుగుదొడ్లు పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. మైనర్ పనులు ఇంకా పెండింగ్ ఉండటంపై మండిపడ్డారు. అదేవిధంగా పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడారు. పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలన్నారు. ఆయన వెంట డీఈ కర్రెన్న, ఏఈ రవికుమార్, ఎంఈఓ జ్యోతి, పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

రీ సర్వేకు సహకరించాలి



గుండ్రేవులలో భూముల రీ సర్వేపై రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శివశంకర్ నాయక్

సి.బెళగల్: మండలంలోని గ్రామాల్లో జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష పథకం కింద చేపడుతున్న భూముల రీసర్వేకు రైతులు, ప్రజలు సహకరించాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ కోరారు. మంగళవారం ఆయన రెవెన్యూ అధికారులతో కలిసి మండల పరిధిలోని గ్రామాల్లో వీఆర్వోలు, గ్రామ సచివాలయ సర్వే సహాయకులు, వీఆర్‌ఏలు చేపట్టిన రీసర్వేలను తనిఖీ చేశారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లో రైతులతో తహసీల్దార్ మాట్లాడారు. గ్రామాల్లో ప్రతిరోజు సర్వే చేసే భూముల వివరాలను సంబంధిత రైతులకు ముందస్తుగా తెలియజేయడం జరుగుతుందని, రైతులు తమ భూముల దగ్గరకు చేరుకుని వివరాలను సర్వే బృందాలకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో తిరుపాల్, సచివాలయ సర్వే అసిస్టెంట్ మల్లికార్జున తదితరులు ఉన్నారు.

పంట నమోదు చేసుకోవాలి



పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాసరెడ్డి

కల్లూరు: మండలంలోని రైతులందరూ రబీలో సాగు చేసిన పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసులు రెడ్డి సూచించారు. మంగళవారం పెద్దపాడులో ఆయన పప్పు శనగ పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేసుకొని రశీదులు తీసుకోవాలన్నారు. పంట నమోదుతోనే మద్దతు ధర, పంట నష్టం, సున్నా వడ్డీ తదితర పథకాలు వర్తిస్తాయని చెప్పారు. మండలంలో ఇప్పటి వరకు పప్పుశనగ 2,689 ఎకరాల్లో, వేరుశనగ 358 ఎకరాల్లో, జొన్న 508 ఎకరాల్లో, పొగాకు 86 ఎకరాల్లో ఈ–క్రాప్ నమోదు పూర్తయిందన్నారు.

గ్రామాల పరిశుభ్రతకు కృషి చేయాలి



డంప్‌యార్డు నిర్మాణ స్థలంను పరిశీలిస్తున్న అధికారులు

సి.బెళగల్: ప్రజాప్రతినిధులు, మండల, గ్రామ స్థాయి అధికారులు గ్రామాల పరిశుభ్రతకు కృషి చేయాలని ఎంపీడీఓ రాముడు అన్నారు. మంగళవారం ఈఓఆర్డీ సందీప్‌తో కలిసి ఆయన మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో పర్యటించారు. వీధుల్లో పరిశుభ్రత పరిశీలించి, గ్రామ పారిశుద్ధ్య కార్మికులకు సూచనలు చేశారు. అదేవిధంగా గ్రామంలో నిర్మించ తలపెట్టిన డంప్‌యార్డు నిర్మాణ స్థలంను పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరగా చేపట్టాలని సర్పంచ్ మాదక్కకు సూచించారు. మండల పరిధిలోని కొండాపురం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి ఉద్యోగుల హాజరు, సంక్షేమ పథకాల అమలు తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆయన ఉద్యోగులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శులు సునీల్‌రాణి, విక్రమ్, నాగరాజు, వీఆర్వో సోముడు తదితరులు ఉన్నారు.

నేడు పెరటి కోళ్ల పంపిణీ

ఓర్వకల్లు: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పొదుపు మహిళలకు బుధవారం పెరటి కోళ్ల పంపిణీ చేయనున్నట్లు ఏపీఎం వెంకటరామిరెడ్డి తెలిపారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఒక్కో యూనిట్‌కు 11 కోళ్ల చొప్పున 75 యూనిట్లు మంజూరైనట్లు చెప్పారు. అందుకు ఒక్కో యూనిట్ ధర రూ.3500 చొప్పున మొత్తం రూ.2.16 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన లబ్ధిదారులు ఉదయం 8 గంటలకు స్థానిక పొదుపు లక్ష్మీ భవనం వద్దకు రావాలని ఆయన సూచించారు.

దీర్ఘకాలిక సెలవుల్లో తహసీల్దార్

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు రూరల్ తహసీల్దార్ డి.వెంకటేష్ నాయక్ వ్యక్తిగత పనుల నిమిత్తం ఈ నెల 6వ తేదీ నుంచి 31వ తేదీ వరకు దాదాపు నెల రోజుల పాటు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఈయన స్థానంలో గూడూరు తహసీల్దార్ శివరాముడు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టి విధులు నిర్వర్తిస్తున్నారు.

'చర్యలు తీసుకోవాలి'

కర్నూలు సిటీ: జిల్లా వ్యాప్తంగా ఫీజుల పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్న కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయం అధికారి గురవయ్య శెట్టికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, శ్రీరాములు గౌడ్, నాయకులు విజయేంద్ర, షబ్బీర్ బాషా, రంగస్వామి, అల్తాఫ్, శరత్‌కుమార్, వెంకటేష్, మునిస్వామి, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

18న ఏకాంకిక పోటీలు

కర్నూలు కల్చరల్: శతాబ్ది మహానటుడు ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకొని టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పౌరాణిక ఏకాంకిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. జనవరి 18వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సీక్యాంప్ కళాక్షేత్రంలో పోటీలు జరుగుతాయన్నారు. 40 నిమిషాల వ్యవధిలోగా ఏకాంకిక ప్రదర్శన పూర్తి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పాల్గొన్న ప్రతి ఏకాంకిక బృందానికి రూ.2000, పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.10,000, ద్వితీయ స్థానానికి రూ.8,000, తృతీయ స్థానానికి రూ.6,000 నగదు ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు జనవరి 12వ తేదీలోగా సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో వివరాలు సమర్పించాలని సూచించారు. మరిన్ని వివరాలకు కళాక్షేత్రం కోశాధికారి లక్ష్మీకాంతరావు సెల్ నంబర్‌లో 93938 11097 సంప్రదించాలన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



గుండ్రేవుల దగ్గర తుంగభద్ర నదిలో చేపపిల్లలను విడుదల చేస్తున్న అధికారులు

సి.బెళగల్: రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేస్తుందని మత్స్యశాఖ జేడీ శ్యామలమ్మ అన్నారు. సుంకేసుల జలాశయం బ్యాక్ వాటర్‌లో చేపల పెంపు కార్యక్రమం ప్రభుత్వం చేపట్టింది. ఇందులో భాగంగా మంగళవారం జేడీ శ్యామలమ్మ మండలంలోని గుండ్రేవుల గ్రామం దగ్గర తుంగభద్ర నదిలో చేప పిల్లలను విడుదల చేశారు. మత్స్య సంపద అభివృద్ధికి, మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై మత్స్యశాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద సుంకేసుల డ్యామ్ పరిధిలోని నది నీటిలో ఉచితంగా 1.66 లక్షల చేప పిల్లలను వదిలినట్లు తెలిపారు. నదిలో వదిలిన చేపపిల్లలు ఆరు నెలల్లోపు కేజీ నుంచి కేజీన్నర మధ్యలో సైజు పెరుగుతాయని, వీటి ద్వారా మత్స్యకారులకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివశంకర్‌నాయక్, మండల మత్స్యశాఖ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు బ్యాంకుల్లో డిపాజిట్ చేసుకోండి



మాట్లాడుతున్న ఆర్‌ఎం నవీన్‌కుమార్

గడివేముల: పొదుపు మహిళలు బ్యాంకులలో కనీసం రూ.10 వేలైనా డిపాజిట్ చేసుకోవాలని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ పీఎస్ నవీన్‌కుమార్ అన్నారు. మంగళవారం గడివేములలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు శాఖలో సిబ్బంది, స్వయం సహాయక సంఘ గ్రూపు లీడర్లు, సభ్యులు, ఖాతాదారులు, ఐకేపీ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ... ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మిగతా బ్యాంకులతో పోల్చితే ప్రత్యేక వడ్డీ అందజేస్తుందన్నారు. మండలంలో స్వయం సహాయక సంఘాలు 673 ఉన్నాయని, అందులో కనీసం 50 శాతం మంది గ్రూపు సభ్యులు రూ.10 వేల నుంచి ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసుకుంటే అత్యవసరాలకు ఉపయోగపడతాయన్నారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు 6.8 శాతం, సీనియర్ సిటిజనులకు 7.6 శాతం వడ్డీ సదుపాయం కల్పిస్తుందన్నారు. గడివేముల శాఖ ద్వారా 673 గ్రూపులకు రూ.30 కోట్ల రుణాలు అందజేశామని, నంద్యాల జిల్లాలో గడివేముల శాఖలో అత్యధిక గ్రూపులు ఉన్నాయన్నారు. రీజనల్ పరిధిలో రూ.5 వేల కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. మిగతా బ్యాంకులతో పోలిస్తే ఏపీజీబీలో రిటైల్, హౌసింగ్ రుణాలు తక్కువ వడ్డీకే అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీజీబీ చీఫ్ మేనేజర్ వర్గిస్ జాన్, ఫీల్డ్ ఆఫీసర్ విష్ణు తేజ్ నాయుడు, బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గృహాలను త్వరగా నిర్మించుకోవాలి



ఇళ్ల నిర్మాణాలపై సమీక్షిస్తున్న హౌసింగ్ డీఈ

సి.బెళగల్: మండలంలోని గ్రామాల్లో లబ్ధిదారులు జగనన్న గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని, ఆ మేరకు అధికారులు, వలంటీర్లు కృషి చేయాలని హౌసింగ్ డీఈ వాసుదేవరావు అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో పర్యటించి జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయంలో ఏఈ సుమంత్‌తో కలిసి లబ్ధిదారులు, వలంటీర్లు, ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు మొదలుపెట్టిన లబ్ధిదారులకు అన్ని రకాల వసతులు కల్పించి నిర్మాణాలు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

కర్నూలు(హస్పిటల్): హైరిస్క్ గర్భిణుల పట్ల ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు ప్రత్యేక శ్రద్ధ కనబరిచాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రామగిడ్డయ్య చెప్పారు. మంగళవారం ఆయన తన ఛాంబర్‌లో మాతృమరణాలపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలోని సిబ్బంది అయిన ఆశ, ఏఎన్‌ఎంలు త్వరగా గర్భిణులను గుర్తించి వారిని ఎంసీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయించాలన్నారు. ప్రతి నెలా 9వ తేదీన జరిగే ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో గర్భిణులకు వైద్యపరీక్షలు చేయించి, అవసరమైన వైద్యం అందే విధంగా చూడాలన్నారు. హైరిస్క్ గర్భిణులు వారిలో ఉంటే నిత్యం వారిని పర్యవేక్షణలో ఉంచాలన్నారు. కాన్పుకు వారం రోజుల ముందుగానే వారిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తే మాతాశిశు మరణాలను తగ్గించవచ్చన్నారు. అంతకుముందు ఆయన కలుదేవకుంట్ల పీహెచ్‌సీ పరిధిలోని సింగరాజుపల్లెకు చెందిన గర్భిణి డిసెంబర్ 13వ తేదిన అధిక రక్తస్రావం వల్ల కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతూ మరణించినట్లు నిర్ధారించి, దానిపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాంజీనాయక్, డీఐవో డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గైనకాలజి హెచ్‌వోడీ డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ సుధీర్‌కుమార్, డాక్టర్ గోపిచంద్, డాక్టర్ ప్రియాంక, కలుదేవకుంట్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గోవిందమ్మ, డీపీహెచ్‌ఎన్‌వో లిన్సెంట్ లిడియా పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను నిలిపివేయాలి




ధర్నా చేస్తున్న ఇన్సాఫ్ కమిటీసభ్యులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని బళ్లారి చౌరస్తా ప్రాంతంలోని అలీషా మసీద్‌కు చెందిన సర్వే నంబర్ 311 వక్ఫ్ భూమిలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను నిలిపివేయాలని ఇన్సాఫ్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు ఎస్.ఎన్‌రసూల్ డిమాండ్ చేశారు. మంగళవారం పనులు జరుగుతున్న భవనం దగ్గర ఇన్సాఫ్ కమిటీ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. వెంటనే అక్రమ నిర్మాణాన్ని నిలుపుదల చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్‌బాష, మున్నా, షేక్షా తదితరులు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్లు ఎక్కని ఆర్టీసీ బస్సులు

- అడ్డగోలుగా వాహనాలు నిలుపుతున్న వైనం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు
- పట్టించుకోని హైవే అధికారులు






హుసేనాపురం వద్ద సర్వీసు రోడ్డుపైన ఆటోలను నిలిపిన దృశ్యం, బస్సు షెల్టర్లు లేక ఎండలోనే వేచివున్న ప్రయాణికులు

ఓర్వకల్లు: ప్రయాణికుల సౌలభ్యం కోసం జాతీయ రహదారి వెంట నిర్మించిన సర్వీసు రోడ్లపైకి ఆర్టీసీ బస్సులు ఎక్కడం లేదు. దీంతో సదరు రోడ్లపై ప్రైవేట్ వాహనాలను అడ్డగోలుగా నిలుపుతున్నారు. తద్వారా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను పరిష్కరించాల్సిన హైవే అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. కర్నూలు నుంచి నంద్యాల వైపు వెళ్లే జాతీయ రహదారిలో మండలంలోని నన్నూరు, ఓర్వకల్లు, హుసేనాపురం, సోమయాజులపల్లె గ్రామాల వద్ద సర్వీసు రోడ్లను నిర్మించారు. అయితే బస్సులు ఆ మార్గంలో వెళ్లకుండా హైవే పైనే వెళ్తుండటంతో సర్వీసు రోడ్లు నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం సదరు రోడ్లపై ప్రైవేటు వ్యక్తులు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, తోపుడు బండ్లు పెట్టుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం సర్వీసు రోడ్ల వెంట బస్సు షెల్టర్లు నిర్మించాల్సి ఉండగా, ఒక్క సోమయాజులపల్లె వద్ద మినహా, ఎక్కడ కూడా బస్సు షెల్టర్లు లేవు. దీంతో ప్రయాణికులు గంటల తరబడి రోడ్లపైనే బస్సుల కోసం నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. వర్షాకాలం, ఎండకాలంలో తమ పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుందని ప్రయాణికులు వాపోతున్నారు. దీని గురించి తెలిసినా ఆర్టీసీ డ్రైవర్లు హైవేలపైనే వెళ్తున్నారని వారు మండిపడుతున్నారు. అసలు సర్వీసు రోడ్లను ఎందుకు నిర్మించారు? అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైన సదరు అధికారులు స్పందించి సర్వీసు రోడ్లపైకి ఆర్టీసీ బస్సులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి



బీక్యాంప్ గ్రంథాలయంలో సందర్శకుల రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న చైర్మన్ సుభాష్ చంద్రబోస్

కర్నూలు కల్చరల్: విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రజలు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ సూచించారు. మంగళవారం బీక్యాంప్‌లోని గ్రంథాలయ శాఖను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశాడు. గ్రంథాలయంలోని రికార్డులు, పుస్తకాలను పరిశీలించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్స్ తదితర పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచామన్నారు. ప్రజలకు అవసరమైన ఎటువంటి పుస్తకాలైనా గ్రంథాలయ రికార్డుల్లో నమోదు చేస్తే తక్షణం కొనుగోలు చేసి అందుబాటులో ఉంచుతామన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. లైబ్రేరియన్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.